

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్ రాజు



# డా. రెడ్డిగారూ - పీటా బ్రెడ్డూ

4

**అప్పుడెప్పుడో** పదేళ్ళ క్రితం నా చిన్నప్పటి క్లాస్‌మేట్ ..అనగా సరిగ్గా నా వయసే ఉన్న కుర్రాడన్నమాట....గుండె పోటుతో నానా అవస్థా పడ్డాడు. అయ్యో , పాపం అనుకుంటూ ఉండగానే.."పాపం లేదు, గీపం లేదు, నువ్వు కూడా డాక్టర్ దగ్గరకి వెళ్ళి అన్ని పార్టులూ ఒకసారి చెక్ చేయించుకో. ఏ పుట్టలో ఏ పాము ఉందో? " అని మా క్వీన్ విక్టోరియా తన పతివ్రతా ధర్మాన్ని నిర్వర్తించి, యధా ప్రకారం నా అర్ధరాత్రి టెంకి జెల్ల తగిలించేసి, సువిశాల ప్రపంచంలోకి పారిపోయింది. నేను నా తలకాయ వెనకాల భాగం తడుముకుంటూ అవును సుమా అనుకున్నప్పటికీ సుందర వదనారవిందము కలిగియున్న నా లాంటి వాడిని పాము పుట్టతో పోల్చడం నాకు ఏమాత్రం నచ్చ లేదు. ఎంత మొగుడయితే మటుకు అంత లోకువా?

ఏమయితేనేం, మర్నాడు మా మెడికల్ ఇన్స్యూరెన్స్ వాళ్ళని పిలిచి నా బోటి గాడు, అనగా ఏ రోగమూ లేక పోయినా సరదాగా డాక్టర్ దగ్గరకి వెళ్ళదల్చుకున్న వ్యక్తి ఎటువంటి డాక్టర్ దగ్గరకి వెళ్ళాలీ అని అడిగాను. ఎందుకంటే, అమెరికాలో హార్ట్ ఎటాక్ వచ్చినా కూడా ఏంబ్యులెన్స్ వాడూ, యమర్జెన్సీ వాడూ మొట్టమొదట "నీ ఇన్స్యూరెన్స్ ఎవరితోటీ?" అని అడిగిన తరవాతే మన పేరూ, గోత్రమూ, రోగమూ అడుగుతారు. ఇప్పుడు నాకు ఎవరికీ చెప్పుకోలేని చిన్న సైజు టెంకి జెల్ల ఎటాకు మాత్రమే కాబట్టి, ఇన్స్యూరెన్స్ వారిని పిలిచి జనరల్ చెకప్‌కి వాళ్ళ లిస్టులో మా ఇంటికి దగ్గరగా ఏ డాక్టర్ ఉంటే అక్కడికే అఘోరించాలి. నాకు యమర్జెన్సీ లేదని తెలియగానే ఇన్స్యూరెన్స్ అమ్మాయి అరగంట పైగా నన్ను ఫోన్ లో అట్టేపెట్టి, అర్ధంకాని సంగీతంతో విసిగించి, మొత్తానికి అర డజను డాక్టర్ల పేర్లు ఇచ్చి, వాళ్ళలో ఎవరు ఎపాయింట్‌మెంట్ ఇస్తే వారి దగ్గరకి వెళ్ళ వచ్చును అని ఎంతో దయతో నాకు అనుమతి ఇచ్చింది. నాకు డాక్టర్ అంటూ అవసరం వస్తే అసలు, సిసలు అమెరికా దొర గారే కావాలని ఎప్పుడో ఒక సారి అనుకున్న మాట గుర్తుకొచ్చి, లిస్టులోంచి పటేల్ , చాంగ్ పిసావో లాంటి పేర్లూ , ఆడ డాక్టర్ల పేర్లూ కొట్టేసి, రిచర్డ్ లాక్ అనే డాక్టర్ దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాను.

ఇంత వరకూ బాగానే ఉంది కానీ, తీరా ఆయన ఫీసుకి వెళ్ళి, ముందు గదిలో రిసెప్షనిస్ట్‌ని చూడగానే నాకు అనుమానం వచ్చేసింది. మా ముత్తాతల పేర్లూ, వాళ్ళకున్న రోగాలూ, లేని ఆస్థిపాస్తులూ మొదలైన వివరాలతో ఆడకూతురు ఇచ్చిన నలభై పేజీలు పూర్తిచేసి, గంట సేపు కుర్చీలో కునికిపాట్లు పడుతుండగా, అదే సైజులో, అదే వాలకంతో ఉన్న మరొక ఆడకూతురు నన్ను లోపలికి పిలిచింది. నా అనుమానం ఇంకా బలపడుతూండగా ఆ పిల్ల నా బరువు తూచి...అంటే నన్ను ఎత్తుకుని ఫీలయిపోతూ కాదు....ఎత్తు కూడా కొలిచి....అంటే నా పక్కనే నుల్చుని మా ఇద్దరికీ ఉన్న అంగుళాల తేడా గమనించి కాదు.....బరువూ, ఎత్తూ రెండూ చూపించే యంత్రం మీద నుంచోబెట్టి , తరువాత నన్ను ఒక పది అడుగుల వైశాల్యం గల జైలులో కూచో పెట్టి, తలుపులు వేసేసి లాక్ గారు ఇప్పుడే వస్తారు అని గది లాక్ చెయ్యకుండా మరొక మానవుడి బరువు తూచడానికి వెళ్ళిపోయింది. పనిలో పనిగా పిల్ల, తూ.గో జిల్లా అగ్రకుల సంజాతుడి రక్తం ఎలా ఉంటుందో అనే కుతూహలంతో కాబోలు, నన్ను సూదులతో గుచ్చి, గుచ్చి, రెండు గేలన్ల రక్తదానం చేయించింది.

అమెరికాలో నేను మొట్టమొదటి సారిగా అప్పుడు నేను కొన్ని ప్రగాఢమైన విషయాలు కనిపెట్టాను. ఒకటేమిటంటే, మనల్ని కూచోబెట్టే రిసెప్షన్ గదిలో డాక్టర్‌గారి సర్టిఫికేట్లూ, ఆయనకి వచ్చిన ఎవార్డులూ, పది వేల డాలర్లు డోనేషన్ ఇచ్చి, ఒబామాగారితో తీయించుకున్న ఫొటోలు మొదలైన వాటితో అలంకరిస్తారు. ఆహా, ఒబామా కూడా మన డాక్టర్ చేతే తన టెంపరేచర్ చూపించుకుంటాడోచ్ అని పేషంట్స్ అందరూ సంబర పడతారన్నమాట. ఇక మొదటి గుమ్మం దాటి, ఇందాకా ఉదహరించిన పది అడుగుల జైల్లోకి వెళ్ళగానే, గోడల నిండా, మన శరీరంలోని లోపలి భాగాలకి పైన తోలు లేకుండా, రక్తసిక్తాలతో, మన సహజసిద్ధమైన అందచందాలని చెరిపేసి అత్యంత ఛండాలముగా ఉన్న బొమ్మలు పెడుదురు. ఇందులో సైకాలజీ ఏమిటంటే, బొమ్మలు చూసి, మన లోపలి బాడీ అంత లకలుకలుగా ఉంది కదా, మనకి ఎక్కడో గేరంటీగా కొంప మునిగిపోయే ప్రమాదమే వచ్చి ఉంటుందీ, అవన్నీ ఈ గొప్ప డాక్టర్‌కి తెలిసే ఉంటాయి అని లోపల్లోపల హడిలి చస్తూ పైకి ధైర్యంగా ఉంటామన్నమాట. ఆనాడు నా కేసులో అప్పటి అధ్యక్షులు అయిన పెద్ద బుష్‌గారితో రిచర్డ్‌లాక్ గారి బొమ్మ చూడగానే భలే కోపం వచ్చింది. ఎందుకంటే, మన తెలుగు వాళ్ళు మరీ అంత అన్యాయం కాదు. రాజేశ్వర రావు అనే పేరు ఉంటే, అమెరికా రాగానే రాజర్ రావ్ అని మార్చుకుంటాం. జగన్ రెడ్డి అనే పేరు ఉంటే, మహా అయితే జాన్ రెడీ అని ప్రచారం చేసుకుంటాం. కానీ, మరీ బొత్తిగా, ఎక్కడా సంబంధం లేకుండా రాబర్ట్ ఒక్కానర్ అనో, జాన్ హేరింగ్టన్ అనో మార్చుకోం కదా! అందు వలన రిచర్డ్ లాక్ అంటే తెల్ల దొరో, కనీసం నల్ల దొరో అయి ఉంటాడనుకున్న నా ఊహాశక్తి దారుణంగా దెబ్బతిని, నిలువునా మోసపోయాను. ఎందు కంటే, ఫొటోలో ఉన్న వ్యక్తి పెద్ద బుష్ మోకాళ్ళంత ఎత్తుగా ఉండి, పిల్లి కళ్ళ తో నవ్వుతూనూ, సరిగ్గా ఇంచుమించు అదే వర్ణన చెయ్యదగ్గ సతీమణితోనూ ఉన్నాడు. అనగా, ఈ తైవాన్ , వియత్నాం, జపాన్ , చైనా, మలేషియా వగైరా పసుపు దేశాల నుంచి దిగిమతి అయిన ఈ రిచర్డ్ లాక్ అసలు పేరు మావ్ సే టుంగో, చౌ ఎన్ లై, లేదా డం చావో పింగో అయిఉంటుంది. పాపం సిగ్గేసో, అమెరికాలో చెల్లడానికో అసలు సిసలు ఇలాటి దొర గారి పేరు పెట్టుకున్నాడు.

ఏమైతేనేం, పది అడుగుల గదిలో ఉన్న చిన్న యంత్రాలనీ, అది సోఫాయో, సింహాసనమో తెలియకుండా మనల్ని పడుకోబెట్టే తెల్ల దుప్పటీ పక్కనీ, హడిలి చస్తూ గోడమీద అశ్లీలంగా ఉన్న బొమ్మల్ని అప్పుడప్పుడు చూస్తూ కాలం వెళ్ళబుచ్చుచుండగా...ఘనత వహించిన రిచర్డ్‌గారు రంగ ప్రవేశం చేశారు. అప్పుడు ఆయన ముఖ కవళికలు చూస్తే నేను ఆయన్ని చూసినప్పుడు ఉన్న "ఇదెక్కడి

గొడవరా, బాబోయ్ " అనే ఫీలింగు ఆయనకి కూడా వచ్చిందని అనుమానం వచ్చింది. ఎందుకంటే, మన పవిత్ర భారతీయులు మొదటి రకం పేషంట్స్ కేటగిరీలోకి వస్తారని అమెరికా అంతటా అనుకుంటారని నేను అనుకుంటాను. ఎందుకంటే, డాక్టర్ దగ్గరకి వెళ్ళేముందు మన వాళ్ళు, తనకి వచ్చిన, రాబోయిన, రాదగ్గ సకల రోగాల గురించీ ప్రపంచంలో అందరితోటీ మాట్లాడేసి, ఆయుర్వేదం మరియు హోమియోపతీ వారిని కూడా సంప్రదించి, దొరికిన పుస్తకాలన్నీ చదివేసి, డాక్టర్ కంటే తనకే అన్ని విషయాల గురించీ తెలుసు అనుకుంటారు. అంతే కాదు, ఈ డాక్టర్ ఏదో నక్కని తొక్కి అమెరికా వచ్చాడు కానీ సబ్జెక్టు ఎక్కువ తెలీదు అని కూడా ప్రగాఢమైన విశ్వాసంతో ఉంటాడు. వీరినే మొదటి కేటగిరీ పేషంట్స్ అంటారు. ఇక రెండో రకం డాక్టర్‌కే అన్నీ తెలిసి ఉండాలి కదా, డబ్బిస్తున్నాం కదా, నా రోగం వాణ్ణే కనిపెట్టమందాం, మనం ఎందుకు చెప్పాలి అనుకునే వాళ్ళు కొంతమంది. ఈ కేటగిరీలో కూడా మన వాళ్ళు ఎక్కువే ఉంటారు. ఇక మూడో రకం వాళ్ళు, డాక్టర్ని మాటలలో పెట్టేసి, అన్నీ నోట్ చేసేసుకుని, దావా వెయ్యడానికి ముందునుంచీ రెడీ అయిపోతారన మాట. ఈ కేటగిరీ వాళ్ళు డాక్టర్ ఆఫీసులో అడుగుపెట్టగానే తమ ఇన్స్యూరెన్స్ వివరాలు ఇస్తూ, డాక్టర్‌కి మంచి మాల్ ప్రాక్టీస్ ఇన్స్యూరెన్స్ ఉందా అని యాధాలాపంగా రిసెప్షన్ పిల్లని అడుగుతారనమాట. ఈ కేటగిరీలూ, వాటి లక్షణాలూ తెలిసిన వాడే కావున సదరు రిచర్డ్ గారు నన్ను చూడగానే చచ్చామ్రా బాభోయ్, మరొక భారతీయుడు వచ్చాడు నా ప్రాణాలకి అనుకుని పెట్టిన ముఖ కవళికలు కూడా నాతో తగిన స్థాయిలోనే ఉన్నాయి.

మొత్తానికి రిచర్డ్‌గారు నన్ను చూడగానే మొహం దాటేసి, కూడా పట్టుకొచ్చిన కాగితాల వేపు దృష్టి సారించాడు. అది చాలదన్నట్టుగా, కర్నాటక సంగీత కచేరీలో మొదటి వరసలో కూచున్న వారిలా తల అటూ, ఇటూ తిప్పడం మొదలు పెట్టాడు. కానీ, తాళం వెయ్యడానికి చేతుల్లో కాగితాలు అడ్డు వచ్చి ఉంటాయి అని నాకు తెలిసిపోయింది. కాగితాలనుంచీ, ముక్కు మీద కళ్ళాజోడు లోంచీ నన్ను చూస్తూ,

"అయ్యా, మీకు "బీపీయస్సీ" ఉందే…అన్నాడు డా. లాకుడు.

బీపీయస్సీ అంటే, ఏదో ఎఫ్ఫారెస్సీ, ఎఫ్ఫార్ సీపీ, ఎంబీబీయస్ లాంటి నాలుగు అక్షరాల డిగ్రీయేమో అనుకుని. "అబ్బే, నాకున్నది మూడక్షరాల పీ.హెచ్.డి మాత్రమే" అన్నాను కించిత్తు సిగ్గుతో,

"నో, నో, నేను చెప్పేది డిగ్రీ కాదు….మీకు, బీపీ, సుగరూ, మరియు కొలెస్ట్రాలూ కలిసి, మెలిసి బీపీయెస్సీ ఉన్నాయి అని మీ తూ.గో జిల్లా అగ్రకుల సంజాతుల రక్త పరీక్షలో తెలుస్తోంది. అది మీకు తెలుసా? తెలియనిచో అవధరింపుడు" అన్ని చావు కబురు చల్లగా

చెప్పాడు డా. రిచర్డ్ లాకుడు అని పిలవబడే అమెరికనైజ్డ్ డంగ్ పింగ్ చావో.

అదిగో అప్పటినుంచీ గత పదేళ్ళగా నా బీపీయస్సీని రకరకాలగా కంట్రోల్‌లో పెట్టుకుంటూ హాయిగా బతికేస్తున్నాను. ఉదహరణకి కథలూ, కమామీషులూ రాసుకున్నా, ఇతరుల చేత రాయించినా, చదివినా, నా బీపీ తగిన స్థాయిలోనే ఉంటుంది. అప్పుడప్పుడు అదోలా వాయించినా, అసలు మా క్వీన్ విక్టోరియా యే స్వీటు కాబట్టి, ఇంక వేరే పంచదార తినడం ఎందుకూ అని తీపి పదార్థా లు ఆట్టే ముట్టుకోను. ఇక నాకున్నదల్లా అనగా కొవ్వు…అనగా తల పొగరు….అది కూడా మరీ అంత అన్యాయం అని అనుకోను. ఈ విధంగా నేను పరిపూర్ణమైన ఆయురారోగ్యాలతో ఉండగా ఏప్రిల్ నెలలో నేను అధికారకంగా సీనియర్ సిటిజెన్ అయిపోయాను అని సోషల్ సెక్యూరిటీ వారు పంపించిన కార్డు ద్వారా తెలిసింది. "ఓహో, అవును సుమా" అనుకుని, " పండగ ఎలా సెలెబ్రేట్ చేసుకుందాం? అని నేను సంబరంగా అడగగానే, "నీ మొహం పండగా లేదు, గాడిద గుడ్డూ లేదు…ఊళ్ళో అందరికీ నీ

వయసు గురించి టాం టాం కొట్టుకుంటే, నా పరువు పోతుంది" అని కోప్పడింది మా క్వీన్ విక్టోరియా. అసలు సంగతేమిటంటే, నా వయస్సు తెలిసిపోతే తన వయస్సు కూడా అందరూ కనిపెట్టేస్తారని ఆవిడ బెంగ అని నేను కనిపెట్టేశాను.

"ఎప్పుడూ చైనా వాడి దగ్గరికే వెళ్తావు కానీ అసలు ఎప్పుడైనా నీ గుండె కాయ చెక్ చేయించుకున్నావా? వెళ్ళి ఒక కార్డియాలజిస్ట్ దగ్గరకి వెళ్ళి చూపించుకో. ఏ పుట్టలో ఏ పాముందో?" అని విడ తన పతివ్రతా ధర్మాన్ని నిర్వహించింది....సరిగ్గా పదేళ్ళ క్రితం లాగే!

ఇప్పుడు కూడా పాము పుట్ట అనే పద ప్రయోగం నాకు ఏ మాత్రం నచ్చక పోయినా, ఆవిడ సలహా నచ్చింది. ఈ సారి పేరు మార్చిడి డిపార్ట్‌మెంట్‌లో మోసపోదల్చుకో లేదు. పైగా, తెలుగు గుండె చప్పుడు తైవాన్ వాడికేం వినపడి చస్తుందీ, అనుకుని, మన వాడే అయిన, టెక్సస్‌లో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న డా. కోటా రెడ్డి గారి దగ్గరకి వెళ్ళాను. ఈ డాక్టర్‌గారు నాకు అంతగా తెలియక పోయినా, ఆయన ఆఫీసులో నన్ను చూడగానే, "సార్, మొన్న మీరు ఫలానా సభలో చాలా బాగా మాట్లాడారు" అంటూ ప్యాయంగా పలకరించి, తన సెల్ ఫోన్‌లో నా ఉపన్యాసం గురించి తను రాసుకున్న నోట్స్ చదివి వినిపించారు. తరువాత అందరి డాక్టర్‌లాగా, ముఖ్యంగా మా లాకుడు గారిలాగా రోగమూ రొష్టూ గురించి ఎక్కువ ప్రస్తావించకుండా, తను అనేక సంవత్సరాలు పరిశోధించి, కనిపెట్టి, తన పేషెంట్స్ అందరికీ అందుబాటులో ఉంచుతున్న "డా. రెడ్డీస్ పీటా బ్రెడ్ " గురించి వివరంగా, సగర్వంగా వివరించారు. బీపీయస్సీ లాంటి రోగాలు రాకుండా ఉండాలంటే తినవలసిన ఆహార పదార్థాలు ఏమిటో, తినకూడనివేమిటో చాలా స్పష్టంగా అందరికీ అర్థం అయ్యేలా ఒక మంచి ప్రణాళిక రూపొందించి, టీవీలలోనూ, సెమినార్‌లలోనూ ప్రచారం చేస్తూ....మన తెలుగు వారికి చాలా మంచి పేరు తెస్తున్న డాక్టర్ కోటారెడ్డి గారు. ఆయన ఆఫీసులో ఏ గదిలో చూసినా, పీటా బ్రెడ్ బొమ్మలు ఎక్కువా, రోగిష్టి బొమ్మలూ తక్కువా ఉంటాయి. అప్పుడు నాకు తెలిసిన ప్రగాఢమైన విషయం ఏమిటంటే, బీపీయస్సీ తగ్గించడానికి నేను అవలంబిస్తున్న కథలూ, కమామీషులూ వ్రాయుటా లాంటి పద్ధతులు పనికి రావేమో అని అనుమానం వచ్చింది. పైగా ఏ తినుబండారాలు తినకూడదు అని ఆయన చెబుతున్నారో, నేను అవే తింటూన్నానేమో అనే అనుమాన పిశాచం నన్ను ఆవహించగానే, నా గుండె లప్, డప్ అని స్పీడుగా కొట్టుకుంది.

నా గుండె స్పీడూ, చప్పుడూ ఆయనకి నచ్చక పాలో మని తనకి చేతనైన, చెయ్యవలసిన పరీక్షలన్నీ అర్జంటుగా చేశేశారు డా. రెడ్డి గారు. పరీక్షల ఫలితాలు ...అంటే టెస్ట్ రిజల్ట్స్ అనమాట....కాగితాల మీదా, గ్రాఫు పేపర్ల మీదా ఛూసి, నన్ను నుంచునే నడిచే, పరిగెట్టే ఒకానొక ఎక్సర్ సైజ్ యంత్రం మీద ....అనగా ట్రెడ్‌మిల్ అనమాట.....దాని మీద పరీక్ష చేశారు. ఆ మాట కొస్తే, నేను యంత్రం మీద పక్కన కడ్డీలు పట్టుకుని నుంచున్నాక, స్విచ్ నొక్కిన మైకెల్ వేలాయుదన్ రెండే రెండు నిమిషాలలో నా గుండె తాలూకు ఎల్ కేజీ ....సారీ...దాన్ని ఈకేజీ అనాలిట...దాన్ని తెర మీద చూసి, వెనువెంటనే నా మొహం చూసి, తన మొహం వేళ్ళాడేసుకుని, ఠపీ మని స్విచ్ ఆఫ్ చేసేసి, డా. రెడ్డి గారి దగ్గరకి పరిగెట్టుకు వెళ్ళాడు. అప్పుడు మా ఇద్దరిలో అంటే నాకో, వేలాయుదన్‌కో హార్ట్ ఎటాక్ వచ్చిందని అని అనుమానం వేసింది నాకు.

టీవీ నైన్ పద్ధతిలో కట్ చేస్తే....నాకేదో గుండె తాలూకు సమస్య ఉందనీ, వెంటనే ఏంజియో అనే పరీక్ష చెయ్యాలనీ నిర్ణయించారు డా. రెడ్డి గారు. ఎందుకైనా మంచిదని మా క్వీన్ విక్టోరియాకి అనుంగు తమ్ముడు, డాలస్‌లో ప్రఖ్యాతి గాంచిన కార్డియాలజిస్టూ అయిన డా. సాగర్‌ని కూడా సంప్రదించి, మర్నాడు అతను వచ్చాక మరొక పెద్ద మనిషి ఈ ఏంజియో చేశాడు. ఈ పరీక్షలో కూడా నేను నెగ్గ లేదు. ఎందుకంటే, ఈయన ఏదో ఒక తీగెని నా రక్తనాళాలలోకి ఎక్కించేసి అటూ, ఇటూ వెతుకుతూ ఉంటే ఒక చోట ఛేదించ లేని బండ రాయి తగిలిందిట. ఇంకా వెతికితే మరొక రెండు రాళ్ళు కూడా దారిని బ్లాక్ చేశాయిట. ఏ ఒక్క బండ రాయికీ, వైరు తగలగానే అహల్య, లేదా మరే పతివ్రతా పుట్టుకు రాలేదు కాబట్టి, నేను శ్రీరామచంద్రుణ్ణి కాదనీ, బండ రాళ్ళని

అతి లాఘవంగా చుట్టుముట్టే ఏర్పాటు చేసి గుండె సరిగ్గా పంపు కొట్టడానికి ఆపరేషన్ చెయ్యాలనీ అందరూ ఏక గ్రీవంగా నిర్ణయించారు. దాన్ని ట్రిపుల్ బై పాస్ సర్జరీ అంటారుట. మనకి తిన్నగా ఉండడమే కానీ ఈ బై-పాస్ పద్ధతులు అంటేనే తెలీదు కదా! అందు చేత నో వర్రీ.

ఈ మొత్తం తతంగం ..అనగా నేను మొట్టమొదటి సారిగా, సరదాగా, కార్డియాలజిస్ట్ రెడ్డి గారి దగ్గరకి వెళ్ళడం, నాది రాతి గుండె అనే బండారం బైట పడడం, ఛాతీ మీద మీద కత్తితో కోత కోసి, తరవాత బాడీని రిపేరు చెయ్యటా ఇవన్నీ కేవలం వారం రోజుల వ్యవధిలో, సీనియర్ సిటిజెన్ అవడానికి వారం ముందు జరగడం, ఇదంతా అమెరికలగూరగంపలాగానే ఉంది. వచ్చే నెల మటుకు ప్రతీ రోజూ డా. రెడ్డీస్ పీటా బ్రెడ్ తింటూ, జూలై 16-17, 2011 నెలలో మా హ్యూస్టన్‌లో జరగబోయే మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు విశేషాలు రాస్తాను. కుదరక పోతే, హాయిగా ముళ్ళపూడి గారితో కబుర్లు చెప్పుకోడానికి వెళ్ళిపోతాను. అంత వరకూ శెలవ్ !

(వంగూరి చిట్టెన్ రాజుగారికి ట్రిపుల్ బై పాస్ సర్జరీ విజయవంతంగా జరిగింది. చిట్టెన్ రాజుగారు నెమ్మదిగా కోలుకుంటున్నారు - *సంపాదకుడు*)

***

Click here to share your comments on this article